AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in

22-10-2025 (Wednesday) MAIN EDITION

## ‘టాటా’కు పండుగ కళ..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** దేశీయ ఆటోమొబైల్ రంగ దిగ్గజ సంస్థ టాటా మోటార్స్ నెల వ్యవధిలోనే లక్షకుపైగా కార్లను విక్రయించి చరిత్ర సృష్టించింది. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే అమ్మకాలు 33 శాతం పెరిగాయని కంపెనీ పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం ఇటీవల జీఎస్టీ సంస్కరణలు తీసుకువచ్చిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా చిన్న కార్లపై జీఎస్టీ 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గింది. సెస్‌ను పూర్తిగా తొలగించింది. దీంతో టాటా కార్లకు భారీగా డిమాండ్ పెరిగింది.

## వారికి ప్రజలే గుణపాఠం చెబుతారు: మంత్రి



**అక్షరటుడే, హైదరాబాద్ :** ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా తెలిపారు. రాజకీయ లబ్ధి కోసం ప్రభుత్వ హాస్పిటళ్లపై కొందరు బురద జల్లుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్ రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లోని పలు బస్తీ దవాఖానాలను సందర్శించిన విషయం తెలిసిందే. వారు మాట్లాడుతూ ఆయా దవాఖానాల్లో వసతులు, మందులు లేవని ఆరోపించారు. ఈ క్రమంలో మంత్రి రాజనర్సింహా వారికి కౌంటర్ ఇచ్చారు.

## నీరజ్ చోప్రాకు అరుదైన గౌరవం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** భారత జావెలిన్ స్టార్ ప్లేయర్, ఒలింపిక్ స్వర్ణ పతక విజేత నీరజ్ చోప్రాకు అరుదైన గౌరవం దక్కింది. ఆయనకు ఇండియన్ ఆర్మీలో లెఫ్టినెంట్ కల్నల్ హోదాను రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రదానం చేశారు. ఈ వేడుక న్యూఢిల్లీలోని సౌత్ బ్లాక్‌లో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఆర్మీ చీఫ్ జనరల్ ద్వివేది సమక్షంలో జరిగింది.

## రిటైల్ రంగానికి దీపావళి జోష్..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** దీపావళి దేశ రిటైల్ రంగానికి బంపర్ సీజన్‌గా మారింది. సీఏఐటీ డేటా ప్రకారం.. ఈ పండుగ సీజన్‌లో దేశవ్యాప్తంగా రూ.6.05 లక్షల కోట్ల రికార్డు స్థాయి అమ్మకాలు నమోదయ్యాయి. గత ఏడాదితో పోలిస్తే ఈ సంఖ్య రూ. 1.8 లక్షల కోట్లు ఎక్కువ. దీని ఫలితంగా దాదాపు 50 లక్షల తాత్కాలిక ఉద్యోగాలు సృష్టించబడ్డాయి.

## విమానంలో సాంకేతిక లోపం




**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికాకు బయలుదేరిన ఎయిరిండియాకు చెందిన బోయింగ్ విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. ఏఐ191 విమానం ముంబయి నుంచి న్యూయార్క్‌కు బయలుదేరింది. ఈ క్రమంలో సాంకేతిక లోపం బయటపడడంతో పైలట్లు విమానాన్ని అత్యవసరంగా ల్యాండ్ చేశారు. ఈ ఘటనలో ఎవరికీ ఏ ప్రమాదం జరగలేదు.

## శ్రీవారి దర్శనం పేరుతో భక్తులకు బురిడీ

**అక్షరటుడే, తిరుమల :** తిరుమల శ్రీవారి దర్శనం చేయిస్తామంటూ భక్తులను మోసం చేసిన కేసులో పోలీసులు ఒక నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. తిరుపతి జిల్లా చంద్రగిరికి చెందిన బురిగాల అశోక్ కుమార్ రెడ్డి సులభంగా వీఐపీ బ్రేక్ దర్శనం, కల్యాణోత్సవం, సుప్రభాత సేవ టికెట్లు, గదులు అందిస్తానని భక్తులను నమ్మించేవాడని పోలీసులు గుర్తించారు. అతని మాటలు నమ్మి వారు తిరుమలకు చేరడంతో ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో మోసపోయామని గుర్తించి టీటీడీ విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. తిరుమల టూటౌన్ పోలీసులు అక్టోబర్ 16న కేసు నమోదు చేసి, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

## శ్రీశైలంలో స్పర్శ దర్శనాలు నిలిపివేత

**అక్షరటుడే, శ్రీశైలం:** కార్తీక మాసం ప్రారంభం కావడంతో శివాలయాలకు భక్తులు పోటెత్తారు. తెలుగు రాష్ట్రాల్లోని పుణ్య క్షేత్రాలైన శ్రీశైలం, వేములవాడ ఆలయాలకు బుధవారం తెల్లవారుజామున నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. శ్రీశైలంలో కార్తీక మాసోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. స్వామి వారి దర్శనానికి భక్తులు భారీగా తరలివస్తున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా గర్భాలయ, సామూహిక అభిషేకాలను అధికారులు నిలిపివేశారు. కార్తీక శని, ఆది, సోమ, కార్తీక పౌర్ణమి, ఏకాదశి రోజులలో స్పర్శ దర్శనాలు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. సాధారణ రోజులలో మూడు విడతలుగా స్వామి వారి స్పర్శ దర్శనానికి అవకాశం కల్పించారు.




# మూసివేత

■ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం.. ■ తక్షణమే క్లోజ్ చేయాలని ఆదేశం

**రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆర్టీఏ చెక్‌పోస్టులను తొలగించింది. ఈ మేరకు రవాణా శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని చెక్‌పోస్టుల్లో భారీగా అవినీతి జరుగుతోంది. ఇటీవల ఏసీబీ అధికారులు పలుమార్లు ఆర్టీఏ చెక్‌పోస్టులపై దాడులు చేపట్టి నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో అవినీతికి అడ్డుకట్ట వేయడానికి ప్రభుత్వం చెక్‌పోస్టులను తొలగిస్తూ నిర్ణయం తీసుకుంది. చెక్‌పోస్టుల ద్వారా ప్రస్తుతం ఇస్తున్న అనుమతులు ఇక నుంచి ఆన్‌లైన్‌లో ఇవ్వనుంది. చెక్ పోస్టుల్లో పని చేస్తున్న సిబ్బంది బుధవారం సాయంత్రం ఐదు గంటల్లోపు వాటిని మూసి వేసి, ఆర్టీఏ కార్యాలయాల్లో రిపోర్ట్ చేయాలని కమిషనర్ ఆదేశించారు.**

- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

రాష్ట్రంలో చెక్ పోస్టుల మూసివేత తక్షణమే అమలులోకి వస్తుందని కమిషనర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అంతేగాకుండా అధికారులకు ఆయన పలు సూచలను చేశారు. ‘జిల్లా రవాణా అధికారి తన సమక్షంలో చెక్ పోస్ట్ అన్ని బోర్డులు, బారికేడ్లను తొలగించి, చెక్ పోస్ట్ మూసివేయాలి. వాహన నిర్వాహకులకు ఆన్‌లైన్ సేవల గురించి అవగాహన కల్పించేలా బోర్డులను ఏర్పాటు చేయాలి. చెక్ పోస్టుల వద్ద ప్రస్తుతం నియమించిన సిబ్బంది అందరినీ సంబంధిత డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌కు తిరిగి పంపించాలి. వాహనాలకు ఎటువంటి ఆటంకాలు లేకుండా ఉండేలా చెక్ పోస్ట్ సైట్లలో ఏర్పాటు చేసిన బారికేడ్లు, సైనేజ్‌లను తొలగించాలి. మొత్తం తొలగింపు ప్రక్రియను వీడియోగ్రాఫ్ చేయాలి. ఆయా చెక్‌పోస్టుల్లోని రికార్డులు, ఫర్నిచర్, పరికరాలు, కంప్యూటర్లు చరాస్తులను వెంటనే డీటీవో కార్యాలయానికి తరలించాలని’ కమిషనర్ ఆదేశించారు.

### అవినీతి పెరగడంతో..


రాష్ట్రంలోని ఆర్టీఏ చెక్‌పోస్టులు అవినీతికి అడ్డాలుగా మారాయి. ఆర్టీఏ అధికారులు యథేచ్ఛగా దోచుకుంటున్నారు. వాహనాల డ్రైవర్లు, యజమానుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. అవినీతిపై ప్రభుత్వానికి అనేక ఫిర్యాదులు అందాయి. ఈ క్రమంలో ఏసీబీ అధికారులు చెక్‌పోస్టులపై పలుమార్లు దాడులు చేపట్టారు. అయినా అధికారులు తమ తీరు మార్చుకోలేదు. ప్రైవేట్ ఏజెంట్లను పెట్టుకొని మరీ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో ఇటీవల ఏసీబీ అధికారులు 12 ఆర్టీఏ చెక్‌పోస్టులపై దాడులు చేపట్టారు. లెక్కల్లో చూపని రూ.4,18,880 నగదు స్వాధీనం చేసుకున్నారు. గతంలో సైతం భారీగా నగదు పట్టుకున్నారు. ఈ క్రమంలోనే తాజాగా ప్రభుత్వం చెక్‌పోస్టులను తొలగిస్తూ నిర్ణయం తీసుకుంది.

### ఆన్‌లైన్‌లో సేవలు

ప్రస్తుతం చెక్‌పోస్టుల ద్వారా అందిస్తున్న సేవలను ఇక నుంచి ఆన్‌లైన్‌లో అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో అవినీతికి అడ్డుకట్ట పడటంతో పాటు వాహనదారులకు మేలు జరుగుతుంది. అంతర్రాష్ట్ర అనుమతులకు సంబంధించిన సేవలు సైతం ఆన్‌లైన్‌లో పొందాలని అధికారులు పేర్కొన్నారు. ఇకపై చెక్‌పోస్టు సేవలను www.transport.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చని సూచించారు. ఈ మేరకు వాహనదారులకు అవగాహన కల్పించేలా బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక..

# రంగంలోకి కేసీఆర్..



**అక్షరటుడే, హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సమీపిస్తుండడంతో బీఆర్ఎస్ ప్రచారంలో జోరు పెంచింది. ఇప్పటికే పార్టీ నేతలు ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తున్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సైతం రంగంలోకి దిగనున్నారు. జూబ్లీహిల్స్ స్థానాన్ని ఎలాగైనా నిలబెట్టుకోవాలని బీఆర్ఎస్ ప్రణాళికలు రచిస్తోంది. ప్రభుత్వ వ్యతిరేకతను అనుకూలంగా మార్చుకొని విజయం సాధించాలని భావిస్తోంది. ఈ మేరకు కాంగ్రెస్ బాకీ కార్డులను ఇంటింటికి పంపిణీ చేస్తోంది. అంతేగాకుండా హైదరాబాద్ నగరంలోని బస్తీ దవాఖానాలను మంగళవారం బీఆర్ఎస్ నేతలు సందర్శించారు. అయితే కొంతకాలంగా ఫామ్‌హౌజ్‌కే పరిమితమైన కేసీఆర్ జూబ్లీహిల్స్ ఎన్నికల సందర్భంగా ప్రచారం చేపట్టనున్నట్లు తెలిసింది. ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్‌తో బుధవారం కేటీఆర్, హరీశ్ రావు భేటీ అయ్యారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచార వ్యూహాలు, రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలపై వారు చర్చించినట్లు సమాచారం. జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌ఛార్జీలతో గురువారం కేసీఆర్ సమావేశం కానున్నారు. ప్రచార వ్యూహాలపై ఆయన దిశా నిర్దేశం చేయనున్నారు. అయితే జూబ్లీహిల్స్ ఎన్నికల నేపథ్యంలో ఆయనతో సభ పెట్టే యోచనలో బీఆర్ఎస్ ఉన్నట్లు తెలుస్తోంది. దీనిపై త్వరలో క్లారిటీ రానుంది.

## కాలేజీలను బ్లాక్‌మెయిల్ చేస్తున్న ప్రభుత్వం: బండి



**అక్షరటుడే, హైదరాబాద్:** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు అడిగిన కాలేజీలను ప్రభుత్వం బ్లాక్‌మెయిల్ చేస్తోందని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. విజిలెన్స్ దాడులతో యాజమాన్యాలను భయపెడుతోందని ఆరోపించారు. హైదరాబాద్ నల్లకుంటలోని శంకర మఠాన్ని బుధవారం ఉదయం బండి సంజయ్ సందర్శించారు. శృంగేరి పీఠాధిపతి విదుశేఖర భారతి స్వామి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. విద్యార్థులు, యాజమాన్యాల భవిష్యత్‌తో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్లాక్ మెయిల్ చేస్తే చూస్తూ ఊరుకుంటామా అని హెచ్చరించారు. పెండింగ్ ఫీజులన్నీ చెల్లించేవరకు కాలేజీలకు అండగా ఉంటామని చెప్పారు. ప్రభుత్వ ఒత్తిడికి లొంగవద్దని సూచించారు.



## తొలిపారితోషికంతో వజ్రం కొన్నా..

**గ్లోబల్ ఐకాన్ ప్రియాంక చోప్రా ఎప్పుడూ తన స్టైల్, ఆత్మవిశ్వాసం, ఫ్యాషన్ సెన్స్‌తో ప్రపంచ వ్యాప్తంగా అభిమానులను ఆకట్టుకుంటుంది. ముఖ్యంగా ఆమె ధరిస్తున్న ఆభరణాలు ప్రత్యేక చర్చనీయాంశం అమవుతుంటాయి. లగ్జరీ జ్యువెలరీ బ్రాండ్ బల్గారి గ్లోబల్ అంబాసిడర్‌గా ఉన్న ప్రియాంక చోప్రా తాజాగా ఒక ఇంటర్వ్యూలో తన ఆభరణాలపై ఉన్న ఆసక్తి, అనుబంధం గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించింది. ‘నా మొదటి సినిమాకు వచ్చిన పారితోషికాన్ని దాచుకొని ఆ డబ్బుతోనే నేను నా జీవితంలో మొదటి ఆభరణం రెండు క్యారెట్ల వజ్రం కొను గోలు చేశాను. నా తల్లి అప్పుడు ‘ఇప్పుడే నువ్వు నిజమైన మహిళగా మారావు’ అని చెప్పిందని అని’ ప్రియాంక తెలిపారు. రెడ్ కార్పెట్ ఈవెంట్లలో ఆభరణాల ఎంపిక గురించి మాట్లాడుతూ.. ‘నేను ధరిస్తున్న దుస్తులే ఏ ఆభరణం ధరించాలో నిర్ణయిస్తాయి. ప్రతి ఈవెంట్, ప్రతి లుక్ వెనుక ఒక కథ ఉంటుంది. 2019లో జరిగిన కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో తెల్లటి టల్లే గౌనుతో చోపార్డ్ డైమండ్ నెక్లెస్, చెవిపోగులతో పీసీ లుక్ ఆ ఏడాది అత్యంత చర్చనీయాంశమైంది.’ అన్నారు.**

—అక్షరటుడే, సినిమా డెస్క్

## ప్రధాని మోదీకి ట్రంప్ ఫోన్..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రధాని మోదీకి ఫోన్ చేశారు. దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఎక్స్‌వేదికగా ట్రంప్‌కు మోదీ ధన్యవాదాలు తెలిపారు. ‘‘ఈ పండుగ నాడు మన రెండు గొప్ప ప్రజాస్వామ్య దేశాలు ప్రపంచంలో ఆశల వెలుగులు నింపాలి. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఐక్యంగా నిలబడాలి’’అని ప్రధాని పోస్ట్ చేశారు. కాగా.. అంతకుముందు వైట్ హౌస్‌లో జరిగిన కార్యక్రమంలో ట్రంప్ దీపం వెలిగించి దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోదీకి మంగళవారం తాను ఫోన్ చేశానని ట్రంప్ చెప్పారు. భారత్, అమెరికా కొన్ని గొప్ప ఒప్పందాలపై పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. రష్యా -ఉక్రెయిన్ యుద్ధం ముగియాలని మోదీ కోరుకుంటున్నట్లు తెలిపారు.

## కుంగిన హెలిప్యాడ్.. రాష్ట్రపతికి తప్పిన ముప్పు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు త్రుటిలో ప్రమాదం తప్పింది. ఆమె ప్రయాణించిన హెలికాప్టర్ ల్యాండింగ్ అనంతరం కుంగిపోయింది. ఈ ఘటనలో ఆమెకు ఎలాంటి గాయాలు కాలేదు. రాష్ట్రపతి ముర్ము కేరళ పర్యటనలో ఉన్నారు. నాలుగు రోజుల పర్యటన కోసం మంగళవారం సాయంత్రం ఆమె కేరళ చేరుకున్నారు. బుధవారం ఉదయం ప్రముఖ పుణ్యక్షేత్రం శబరిమల దర్శనానికి ఆమె బయలు దేరారు. కేరళలోని పతనంతిట్ట సమీపంలోని ప్రమదం ప్రాంతంలో ఆమె హెలికాప్టర్ ల్యాండ్ అయింది. హెలిప్యాడ్ కుంగిపోవడంతో హెలికాప్టర్ టైర్లు దిగబడి, ఓ వైపు ఒరిగింది. వెంటనే స్పందించిన పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది రాష్ట్రపతిని సురక్షితంగా బయటకు తీసుకు వచ్చారు. అనంతరం హెలికాప్టర్‌ను నెట్టుకుంటూ పక్కకు చేర్చారు.

## పోటెత్తిన నామినేషన్లు

■ జూబ్లీహిల్స్‌లో భారీగా దాఖలు చేసిన అభ్యర్థులు
■ 321 నామినేషన్లు వేసిన 211 మంది




**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు రికార్డు స్థాయిలో నామినేషన్లు దాఖలు అయ్యాయి. మొత్తం 211 మంది అభ్యర్థులు 321 నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్లకు గడువు మంగళవారం మధ్యాహ్నం 3 గంటల వరకే ఉండగా.. చివరి రోజు పోటెత్తారు. దీంతో అర్ధరాత్రి వరకు అధికారులు నామినేషన్లు స్వీకరించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అసెంబ్లీ స్థానానికి 200కు మించి అభ్యర్థులు నామినేషన్ వేయడం రాష్ట్ర వ్యాప్తంగా చర్చకు దారి తీసింది. ఎన్నికల అధికారులు బుధవారం నామినేషన్లను పరిశీలిస్తున్నారు. ఇందులో చెల్లని వాటిని తొలగిస్తారు. దీంతో కొంతమంది అభ్యర్థులు తగ్గే అవకాశం ఉంది. అలాగే ఉపసంహరణకు ఈ నెల 24 వరకు గడువు ఉంది. ఆ లోపు పలువురు అభ్యర్థులు తమ నామినేషన్లపై వెనక్కి తగ్గుతారని తెలుస్తోంది. 24న తర్వాత బరిలో ఉండే అభ్యర్థులపై స్పష్టత రానుంది.